# సమాంతర రేఖలు

శ్వేత 'గర్భవతి' అని తెలిసి తల్లిదండ్రులు ఎంతో ఆనందించారు.

ఆనందం పట్టలేక కూతురి వద్దకొచ్చేశారు.

రకరకాల పిండివంటలు తెచ్చారు.

ఆమె తల్లిదండ్రుల దగ్గర ఏమీ చెప్పలేదు.

వాళ్ళున్న మూడ్రోజులూ హాయిగానే గడిచాయి.

భర్తలో ఎంత మార్పు?

నేను చేసిన నేరం ఏమిటి? ఎందుకిలా కృత్రిమ అభిమానం ప్రకటించారు? ఈ మూడ్రోజులూ?

కానీ...

మళ్ళీ...

ప్రస్తుతం మాటల్లో 'స్వచ్ఛత' లేదు.

గత నెల్లాళ్ళుగా భర్త ప్రవర్తన అంతు బట్టడం లేదు.

ఆమె కన్నీళ్ళను ఆపుకోలేక పోయింది.

"ఎందుకా ఏడుపు?" విలాసంగా సిగరెట్ విసిరేసాడు. శశికాంత్ తలుపులు వేసేసాడు.

గబగబా సూట్‌కేస్ తెరిచాడు.

అడుగున వున్న ఓ ఫోటోను విసురుగా విసిరాడు.

"ఎవడితను? ఇతనికీ నీకూ వున్న సంబంధం ఏమిటి? ఆ ఫోటో అట్టడుగున అంత భద్రంగా ఎందుకు దాచుకున్నావ్? నీవతన్ని ప్రేమించావా? పెళ్ళిచేసుకుందామనుకున్నావా? నీ పేరెంట్స్ అంగీకరించలేదా? నేనే దొరికానా?" ఆవేశంగా ప్రశ్నల వర్షం కురిపించాడు.

అతని మొహం కందగడ్డలా మారింది.

ఆమెలో అణువణువునా అసహ్యం!

మొహం రెండు చేతుల్లో కప్పుకొని భోరున ఏడ్చిందామె.

"నీ కన్నీటికి కరిగిపోతాననుకోకు. ఆడది ఎంత మోసగత్తో... ఎంతగా నమ్మించగలదో ఇప్పుడిప్పుడే అర్థం అవుతోంది" ఈటెల్లా వున్నాయతని మాటలు.

తక్షణ ఏడుపు ఆపిందామె.

ఆమెలో ఆవేశం పెల్లుబికింది.

"మీరు ఎంత సంకుచితులో ఇప్పుడు బుజువైందండీ... దీనికై నెల్లాళ్ళుగా వేధించారన్నమాట. ఛీ... ఛీ ఈ అనుమానం జబ్బు మీకు ఉందన్నమాట. ఏం? నాకో మంచి స్నేహితుడు ఉండకూడదా? స్నేహితులు మగాళ్ళకే గాని, ఆడవాళ్ళకుండ కూడదా? నేనా ఫోటోని దాచుకున్నంత మాత్రాన ఏదో సంబంధం వున్నట్లేనా? ఇంతకీ ఇతని గురించి మీకేం తెలుసండీ?"

"... ... ..."

"ఇతని పేరు ప్రకాష్. చిన్నప్పటి నుంచీ నా క్లాస్‌మేట్. చాలా మంచివాడు. మా ఇంట్లో కలిసిపోయాడు. మా కష్టసుఖాల్లో సమంగా పాలుపంచుకునేవాడు. నాన్నగారు ఏభయ్ అయినేళ్ళకే అకస్మాత్తుగా రిటైర్ అయిపోయి అమ్మ, మేము కూడా బెంగపడుతున్నప్పుడు మరో బ్రతుకు మీద ఆశ కల్పించాడు. టైప్ వర్క్ ఎక్స్‌ట్రా చేసి అంతో ఇంతో ఇచ్చేవాడు. మాలో బ్రతుకు మీద ఆశలు కల్పించాడు అన్నివిధాలా! మా పెరట్లో కూరగాయలు వేయించి, మాకు రోజూ కూరలు కొనుక్కునే బాధ తప్పించాడు. నాన్నగారి మీదకి అప్పుల వాళ్ళంతా దాడిచేస్తే సమయస్ఫూర్తితో వాళ్ళని శాంతపర్చి పంపేవాడు. పెన్షన్ అతి తక్కువ వస్తున్న నాన్నగారికి ఒకప్పటి గౌరవాన్ని కోల్పోయిన, నాన్నగార్ని స్వంత కొడుకులా సహాయం చేసిన వ్యక్తి అతనే! మా కుటుంబానికి చిన్నప్పటి నుంచీ అత్యంత సన్నిహితుడయిన అతని ఫోటోని నేను దాచుకొన్నంత మాత్రాన... ఛీ... ఛీ..." చీదరింపుగా అందామె.

తలదించుకున్నాడు శశికాంత్.

"పెళ్ళికి ముందు పరిచయాలని అక్రమ సంబంధాలుగా ఆలోచించుకునే వాళ్ళంటే నాకు చాలా అసహ్యం. ఆడదానికీ ఓ మనసూ... అనుబంధాలూ వుంటాయి. పెళ్ళికి ముందయినా పెళ్ళయాకయినా ఆడది 'బండరాయి' కాదండీ! ఆధునిక సమాజంలో ఇంత సంకుచితత్వం ఉన్న వాళ్ళున్నారంటే, నాకు ఆశ్చర్యంగా ఉంది. ఒకే. మన మనసులు కలవవు. మన సంసారం సరిగా సాగదు. నేను వెళతాను" ఆమె తన బట్టలూ అవీ సర్దుకోసాగింది.

శశికాంత్ ద్వారానికి అడ్డుగా నిల్చున్నాడు.

"తప్పుకోండి... నేను విడాకులిస్తాను" కోపంగా అందామె.

ఆమెని గట్టిగా కౌగలించుకోబోయాడు.

"నో... డోన్ట్ టచ్ మీ" తలుపులు తీసిందామె.

చరచరా వెళ్ళిపోయిందామె.

స్థాణువులా చూస్తుండిపోయాడు శశికాంత్. ●

